క్లుప్తంగా

సామూహిక సీమంతాలు



అంగన్‌వాడీ కేంద్రంలోని సామూహిక సీమంతాలు

అనంతగిరి: మండలంలోని ఎస్.ఆర్.పురం పంచాయతీ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సన్యాసమ్మ మాట్లాడుతూ గర్భిణిలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోని, ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యకర్త సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

జి.మాడుగుల: శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకొని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలు బుధవారం వరకు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు సింహాచలంరాజు, రెడ్డిబాబు తెలిపారు. పోటీల్లో విజేత టీమ్‌లకు ప్రథమ బహుమతిగా రూ.10,000, ద్వితీయ బహుమతిగా రూ.5000 షీల్డులు అందజేయనున్నట్టు తెలిపారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాలకు 9049246279, 8985651766, 6303199525,9490034681 సంప్రదించాలని వారు కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మాలన్న

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ పీఆర్ రోడ్డు నుంచి చదురమామిడి గ్రామం వరకు సీసీడీపీ పథకం నిధులతో రోడ్డు పనులను సర్పంచ్ ఎల్.మాలన్న సోమవారం ప్రారంభించారు. చదురమామిడి గ్రామం వరకు 1.20 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.40లక్షలు నిధులను మంజూరు చేసింది. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. చదురమామిడికి రోడ్డు సమస్య త్వరలో పరిష్కారమవుతుందని రవాణా ఇబ్బందులు తొలుగుతాయన్నారు.

సంత వేలంపాట రేపు

డుంబ్రిగుడ: మండలంలోని అరుకు వారపు సంత వేలంపాట సర్పంచ్ శారద అధ్యక్షతన 29న నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి కనక మహాలక్ష్మి చెప్పారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 9గంటలకు వేలంపాట జరుగుతుందన్నారు. పాల్గొన దలిచే వారు రూ.2వేలు జమ చేసి తమ ఆధార్ కార్డు జెరాక్స్, మూడు పాస్‌పోర్టు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కొయ్యూరు: ఇటీవల కొత్తపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ నగదుతో పాటు నిత్యావసరాలను సోమవారం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి మల్లేశ్, రావణాపల్లి ఎంపీటీసీ ఇరువాడ సత్యవేణి, మాజీ సర్పంచ్ కొండమ్మ, నేతలు నానాజీ, వరలక్ష్మి, రాంబాబు, సత్యనారాయణ, రాజు, వరలక్ష్మి, పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా కొత్తపల్లిలో సీపీఐ నాయకురాలు కొండమ్మ అధ్యక్షతన మండల సమితి సమావేశం నిర్వహించారు.

పాతకోటలో పశువైద్య శిబిరం



శిబిరంలో వైద్యాధికారి చరణ్, సిబ్బంది

హుకుంపేట: పాతకోట పంచాయతీలో పశు సంవర్థక శాఖ వైద్యాధికారి డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. నట్టల నివారణ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు. పశువులు అనారోగ్యం బారిన పడితే తక్షణమే సమాచారం అందిస్తే వైద్య సేవలందిస్తామన్నారు. సింహాచలం, ప్రేమమల్లి, సుజాత, లైకోన్, బ్యూల, చంద్రకళ, శివాజీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వెతలు తీరేనా?

- వంతెన లేక ఇరు రాష్ట్రాల ప్రజలకు ఇక్కట్లు
- టీడీపీ హయాంలో నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో నిలిచిన పనులు





తాత్కాలిక ఐరెన్ వంతెన (ఇన్‌సెట్‌లో) పునాది స్థాయిలో నిలిచిన వంతెన పనులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర– ఒడిశా రాష్ట్రాలను కలుపుతూ సరిహద్దులో ఆనుకొని ఉన్న జోలాపుట్టు వంతెనకు గత పాలకుల నిర్లక్ష్యంతో నేటికి పూర్తి కాలేదు. దీంతో ఇరు రాష్ట్రాల ప్రజలు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు. గత 15 సంవత్సరాలుగా వంతెన పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. పనులు పూర్తి చేయాలని పలుమార్లు సరిహద్దు గిరిజనులు అప్పటి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లిన హామీలతో సరి పెడుతూ రావడం చివరికి వంతెన నిర్మాణానికి ఖర్చులు ఎక్కువ అయిపోవడం కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారు. 2006లో రూ.5 కోట్లు ఎంపీ నిధులతో అప్పటి కాంగ్రెస్ ఎంపీ కిషోర్ చంద్రదేవ్ వంతెనకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వంతెన పూర్తయితే ఇరు రాష్ట్రాలకు రవాణా కష్టాలు తీరుతాయని అందరూ భావించారు. అయితే పునాది స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. 2004 సంవత్సరంలో వరద ఉధృతికి సరిహద్దును కలుపుతూ ఉన్న ఐరెన్ వంతెన కొట్టుకుపోవడంతో అప్పటి నుంచి ఇరు రాష్ట్రాలకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. జలశయాలపై నుంచి ఉన్న మార్గంలో రాకపోకలు చేస్తున్నప్పటికీ దీంతో గండి పడే ప్రమాదం ఉండటం వల్ల భారీస్థాయి వాహనాలను అధికారులు నిలుపుదల చేశారు.సరిహద్దు ప్రజలు జలశయ అధికారుల సహకారంతో ఐరెన్‌తో తాత్కాలిక వంతెన నిర్మించుకొని కాలి నడకన, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగే విధంగా చొరవ తీసుకున్నారు.

వంతెన పనులు చివరికి నిధులు వెనక్కి వెళ్లిపోయి టెండర్ రద్దయింది. గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే నిధులు వెనక్కి వెళ్లిపోయాయని స్థానికులు చెబుతున్నారు. యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వంతెన పూర్తయితే మార్గం సుగమం

వంతెన పూర్తి అయితే ఇరు రాష్ట్రాల రాకపోకలు ఇబ్బందులు తొలగుతాయని అనుకొన్నాం. కానీ గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిధులు వినక్కి వెళ్లిపోయాయి. నిత్యం రవాణా కష్టాలు పడుతున్నాం. ప్రస్తుతం వంతెన పనులకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కరించి, రాకపోకలకు మార్గం సుగుమం చేస్తారని ఆశిస్తున్నాం. – వి.మణి, జోలాపుట్టు గ్రామస్తుడు, ముంచంగిపుట్టు మండలం

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

జోలాపుట్టు వంతెన నిధులు ఎప్పుడొ వెనక్కి వెళ్లిపోయాయి. టెండర్ కూడ రద్దయ్యింది. చాలా సార్లు సరిహద్దు ప్రజలు వంతెన సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో వంతెన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– జబ్బార్, ట్రైబల్ వెల్ఫర్ ఏఈ, ముంచంగిపుట్టు మండలం

5 నుంచి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

అడ్డతీగల: స్థానిక శ్రీ అనంత చక్రరావు జూనియర్ కళాశాల మైదానంలో వచ్చేనెల 5 నుంచి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు అడ్డతీగల క్రికెట్ సర్కిల్ పర్యవేక్షక కమిటీ కన్వీనర్ చింతపల్లి రఘునాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాలకు చెందిన క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చన్నారు.పాల్గొనే ప్రతి జట్టు రూ.1,500 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. విన్నర్స్‌కి రూ.40,000 నగదు ట్రోఫీ,రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.20,000 నగదు ట్రోఫీ,సెమీఫైనల్స్‌కి చేరిన ఒక్కో జట్టుకు రూ.5 వేల చొప్పున నగదు అందజేస్తామన్నారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్,బెస్ట్ బౌలర్,బెస్ట్ ఫీల్డర్,బెస్ట్ కీపర్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌లకు ట్రోఫీలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొదలచిన జట్లు ఏప్రిల్ 2 లోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.మరిన్ని వివరాల కోసం 6303987802 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని రఘునాథ్ తెలిపారు.

పది అడుగుల నాగుపాము హతం



ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టు గ్రామంలో సొలగం హనుమంతురావు అనే గిరిజనుడిని ఇంట్లో పది అడుగుల నాగుపాము సోమవారం హల్‌చల్ చేసింది. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో నాగుపాము ఇంట్లోకి ప్రవేశించింది. దీంతో వారు బయటకు పరుగులు తీశారు. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు ప్రసన్నకుమార్, గోపాల్, వెంకట్‌తో పాటు పాస్టర్ బర్నాబాస్ ఎంతో చాకచక్యంగా నాగుపామును హతమార్చారు. దీంతో హనుమంతరావు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

గంగవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీఎం జేమ్స్, ఎంఎంఎస్ అధ్యక్షరాలు శారపు పావని తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమానికి మండల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, మహిళా సంఘ సభ్యులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ అప్పలరాజు, పార్టీ ఇన్‌ఛార్జి రఘునాథ్ విజ్ఞప్తి చేశారు.

గిరిజన సంఘం నేతల ధర్నా

రంపచోడవరం: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఏజెన్సీ గిరిజన సంఘం నాయకుడు ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ 1/70 చట్టాన్ని అమలు చేసి, పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు సంజయ్, జోగారావు, సర్పంచ్ విజయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవాశ్రమం పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అడ్డతీగల: ఏలేశ్వరంలోని స్వామి దయానంద సేవాశ్రమం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పవనగిరి సేవా ట్రస్ట్ కన్వీనర్ తణుకు వెంకటరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవాశ్రమంలో గిరిజన విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్ట పేర్కొన్నారు.అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని వారు, తల్లిదండ్రులు ఉండి తగిన ఆర్థిక స్తోమత లేని వారి పిల్లలు చేరవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 9491315362 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

భవనం మంజూరు చేయాలి

కొయ్యూరు: శరభన్నపాలెం రైతుభరోసా కేంద్రం భవనం నుంచి పెచ్చులు రాలుతున్నాయి. వెటర్నరీ ఆస్పత్రికి సంబంధించిన భవనాన్ని తాత్కాలికంగా రైతు భరోసా కేంద్రం కోసం మంజూరు చేశారు. అయితే భవనం చాలా వరకు పాడైపోవడంతో పెచ్చులు రాలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారని, వర్షం పడితే నీరు కారుతోందంటున్నారు. భవనాన్ని సర్పంచ్ సత్యనారాయణ పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



భవనం నుంచి రాలిపడిన పెచ్చులను పరిశీలిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎమ్మెల్యే పరామర్శ

దేవీపట్నం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, గండిపోశమ్మ ఆలయ మాజీ చైర్మన్ కట్టా సత్యనారాయణ ఇటీవల పితృవియోగం పొందారు. సత్యనారాయణ తండ్రి కట్టా అప్పారావు పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి, నాయకులు తోట రాజేశ్వరరావు, కందుల బాబ్జి, కుంజం మురళీ, శిరశం పెద్దబ్బాయిదొర తదితరులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



ముంచంగిపుట్టులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యూరు/ముంచంగిపుట్టు: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక చర్యలను నిరసిస్తూ వచ్చే నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు నూకరత్నం, సత్యవేణి, గిరిజన సంఘం నేత, సీఐటీయూ నేతలు సూరిబాబు, శంకరరావు చెప్పారు. కొయ్యూరు, ముంచంగిపుట్టు మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పదవి విరమణ తరువాత పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అపాలన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని, కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్ కేఏస్ఆర్ పేటలో సీతమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా సాగింది. పలు రకాల వంటకాలు, పసుపు, కుంకుమలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: దారకొండ దారాలమ్మ తల్లి హుండీని సోమవారం లెక్కించారు. ఎండోమెంటు ఈఓ సాంబశివరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. రూ.2,87,300 లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ హెచ్‌డీ పీటీ ఈశ్వరరావు, జూనియర్ సహాయకులు తేజ, పార్టీ కార్యవర్గ సభ్యులు విష్ణుమూర్తి, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి గణేశ్వరరాజు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే క్షయకు దూరంగా ఉండవచ్చని రాజేంద్రపాలెం వైద్యుడు బాబు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ఆశ్రమ బాలుర పాఠశాల–2లో పదో తరగతి విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్ వార్డెన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీజేపీకి బాలయ్యదొర రాజీనామా

జి.మాడుగుల: బిజెపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లకే బాలయ్యదొర అనారోగ్య కారణాల దృష్ట్యా పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తాను తరచూ ఆనారోగ్యానికి గురవుతున్నాని పార్టీకి పూర్తి స్థాయిలో సేవలు అందించలేకపోతున్నానని పేర్కొన్నారు. రాజీనామ పత్రాన్ని జిల్లా బిజెపీ అధ్యక్షుడు పాంగి రాజారావుకు అందిస్తున్నట్టు తెలిపారు.

ప్రకృతి సాగుపై అవగాహన

గూడెంకొత్తవీధి: ప్రతి రెవెన్యూ గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. కొత్తవీధి గ్రామంలో పీఎం కిసాన్ యోజనకు సంబంధించి గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

వర్షంతో జీడిమామిడి రైతు దిగాలు



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: జీడిరైతులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. రెండు మూడు రోజులు వర్షాలు కురిసి వాతావరణం బాగుంటుందని భావిస్తే వారం రోజులుగా రోజూ వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వచ్చిన కొద్దిపాటి పంటనైనా రక్షించుకుందామనుకున్న రైతుల నమ్మకాన్ని వర్షాలు వమ్ముచేస్తున్నాయి. జీడి పంటకు వేడి ఎక్కువ అవసరం. ఎంత వేడి ఎక్కువగా ఉంటే అంత బాగా పంట పండుతుందని, పండ్లు దిగుబడి బాగుంటుందని రైతులు చెబుతున్నారు. అయితే సరైన సమయంలో వర్షాలు కురిసి వాతావరణం చల్లబడడంతో పంట పాడైందని, ఇప్పటికే పంట పూత మాడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి నుంచి మే చివర వరకు వాతావరణం వేడిగా ఉంటేనే జీడి పూత నుంచి పిందె దశకు వచ్చి కాయలు పిక్కలు వస్తాయి.ఈ ఏడాది వాతావరణం అనుకూలించపోవడంతో పంటపై పెట్టుకున్న ఆశలు వాడిపోయాయని వాపోతున్నారు. ఇలా వర్షాలు రోజూ కురిస్తే వచ్చే పంట కూడా రాకుండా పోతుందంటున్నారు. తడిసిన పిక్కల నెపంతో వ్యాపారులు ధర తగ్గించేస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



డి.ఎస్.పాలెంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

దేవీపట్నం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హత కలిగిన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. డి.ఎస్.పాలెం పంచాయతీలో ఆమె సోమవారం పర్యటించారు. డి.ఎస్.పాలెం, పెద్దూరు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో రూ.56 లక్షల వ్యయంతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగు నీరందించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకులకు శంకుస్థాపన చేవారు. అనంతరం ఆయా గ్రామాల్లో

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించి తక్షణమే మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు ఆమె గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ కుంజం మురళీ, సర్పంచ్‌లు మిర్తివాడ పోసిరెడ్డి, కోసు లక్ష్మణ్ ,ఎంపీటీసీ సభ్యురాలు కోసు బాపనమ్మ, నాయకులు తోట రాజేశ్వరరావు, కందుల బాబ్జి, శిరశం పెద్దబ్బాయిదొర, గారపాటి మురళీ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీకి చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమ్య

చింతపల్లిరూరల్: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ సీడీపీవో జి.రమ్య అన్నారు. కిటుముల పంచాయతీలో బౌడా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రమ్య మాట్లాడుతూ అవహన లోపంతో సరైన పోషకాహారాన్ని తీసుకోక రక్తహీనత తదితర లోపాలతో ఇబ్బందికి గురవుతున్నారని ,గర్భిణులు,చిన్నారులు ఎదుర్కొంటున్న పోషకాహార లోపాన్ని నియంత్రించాలన్నారు. గర్భిణుల కోసం అమలులోకి తీసుకువచ్చిన మెనుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్పంచ్ రమణమ్మ, పంచాయితీ కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టిక ఏర్పాటుచేయాలి

అరుకులోయ రూరల్: స్థానిక మార్కెట్ యార్డులో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని వినియోగదారుల సంఘం నాయకులు పంచాయతీ ఈవో శేఖర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘం నాయకుడు కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని దుకాణాల్లో ధరలు పట్టిక ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు.వినియోగదారుల సంఘం నాయకులు జోగారావు తదితరులున్నారు.

దుర్గమాంబ విగ్రహ పునఃప్రతిష్ఠ

తుమ్మపాల : అనకాపల్లి మండలం గోపాలపురం గ్రామంలో శ్రీ దుర్గమాంబ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు



గ్రంథాలయంలోని అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు

పెదబయలు: స్థానిక శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిపుస్తకాలు అందుబాటులో ఉన్నట్టు గ్రంథాలయ అధికారి ఓ.శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రమాదేవి, కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావుల సహకారంతో 43 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిరుద్యోగులు ఈ పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

రాజవొమ్మంగి: వచ్చేనెల 3వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఆన్సర్ షీట్ బుక్‌లెట్స్ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నట్టు స్థానిక ఎంఈవో తాతబ్బాయిదొర సోమవారం తెలిపారు.వాటిని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య భద్రపరిచినట్టు ఆయన తెలిపారు.

నేత్రపర్వంగా సీతారాముల పెళ్లిరాట



సీతారాముల పెళ్లిరాటకు పూజలు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి కల్యాణ వేడుకల్లో భాగంగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పెళ్లిరాటోత్సవాలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ఆయా ఆలయాల పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. పెదరామస్వామి ఆలయంలో దాడి పద్మావతి ఆధ్వర్యంలో పెళ్లిరాటకు పూజలు చేశారు. చేపలబజారు సీతారామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు రాటకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 30న కల్యాణం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధులగుండా ఊరేగించనున్నట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం సీతారాముల ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నారాయణరావు, దుర్గారావు, సూరిబాబు, వెంకటేశ్వరరావు, జగన్నాథరావునాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

గ్రామపంచాయితీ – పెదవలస

టెండరు ప్రకటన

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పెదవలస గ్రామపంచాయితీకి సంబంధించి 2022-23 ఆర్థిక సంవత్సరమునకు సంత ఆశీలు పాట ఈ నెల తే 31/03/2023దితో ముగియవలసి ఉన్నందున, 2023-24 సం॥ ఆర్థిక సంవత్సరమునకు శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి, పాడేరు వారి ఆదేశములు అనుసరించి శ్రీ పంచాయితీ విస్తరణ అధికారి (పి.ఆర్-ఆర్.డి), జి.కె.వీధి వారి సమక్షంలో పంచాయితీ సర్పంచ్ గారి అధ్యక్షతన నిర్వహించవలసి ఉన్నది. కావున తే 29/03/2023దిన సంత వేలం పాట నిర్వహించుటకు నిర్ణయించడమైనది. ఈ వేలం పాటలో పాల్గొనవలసిన వారు తే.28/03/2023ది (ఉ॥ 10.00 గల నుంచి సా॥5.00 గ॥ల వరకు) మరియు 29/03/2023 ఉ॥ 10.00ల నుంచి మ॥ 1.00 గల వరకు మాత్రమే వారి యొక్క పేర్లు గ్రామసచివాలయం నందు నమోదు చేసుకోవలసి ఉంటుంది. అదే రోజు మ॥ 2.00 గ॥ల నుండి వేలం పాట గ్రామసచివాలయం నందు నిర్వహించబడును అని గ్రామ ప్రజలు అందరికీ తెలియజేయడమైనది.

పంచాయితీ కార్యదర్శి, పెదవలస గ్రామపంచాయితీ